రాజేంద్రనగర్ పీఎస్‌కు ఉత్తమ అవార్డు



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు దేశంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా అవార్డు వచ్చిన సందర్భంగా ఆదివారం నియోజకవర్గం బీజేపీ నాయకులు ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. స్టేషన్‌కు దక్కిన ప్రశంస పత్రంతో పాటు ట్రోఫీని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాయకులకు చూపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్ యాదవ్, వై. శ్రీధర్, మల్లా రెడ్డి, కొమరయ్య, రాజశేఖర్, సుధాకర్ రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం నిరంతర కృషి



పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్లు, మంచి నీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దశల వారిగా సమస్యలను పరిష్కరించేందుకు పక్కా ప్రణాళి రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కుమారస్వామి, వైస్ ప్రెసిడెంట్ మధుసుధన్‌రెడ్డి, పర్శురాములు, నర్సింగ్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: తాగడానికి డబ్బు లేకపోవటంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...వికారాబాద్ జిల్లాకు చెందిన పెద్ద గోవిందు (42), లేబర్ పనిచేస్తు భార్య మణెమ్మ, కుమారుడు రమేశ్ తో కలిసి హైదర్ షాకోట్‌లోని మాధవినగర్ కాలనీలో ఉంటున్నాడు. మద్యం కొనుగోలు చేసేందుకు డబ్బు లేకపోవటంతో నిరాశకు గురయ్యాడు. ఈనెల 5వ తేదీన అతని భార్య స్వగ్రామం వెల్లటం, 6వ తేదీ శనివారం కుమారుడు ఆటో నడిపేందుకు బయటకు వెల్లటంతో గోవిందు ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సాయంత్రం గోవిందు కూతురు వచ్చి డోరు కొట్టిన తీయకపోవటంతో అనుమానం వచ్చి చుట్టు పక్కల వారిని పిలిచి డోరు తెరిపించింది. ఇంట్లో తండ్రి ఉరివేసుకుని మృతి చెంది ఉండటాన్ని గమనించి వెంటనే షాదాన్ ఆసుపత్రికి తీసుకొనివెళ్లింది. డాక్టర్‌లు అతను అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వారికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీహాల్‌కు నిధులు మంజూరు చేయిస్తా



రాయదుర్గం సగర సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సగర తదితరులు

రాయదుర్గం: శేరిలింగంపల్లిలోని సగరుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. రాయదుర్గంలోని సగర సంఘం నూతన ఆంగ్ల సంవత్సర కేలండర్‌ను సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగరతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో సగర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షలను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సగర సంఘం నాయకులు రవి, విష్ణు, వెంకటరాములు, ఉప్పరి మహేందర్, ఎర్రంశెట్టి సీతారామ్, పద్మ, కురుమూర్తి, వేముల రవి,సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించొద్దు



మిలటరీ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలపై కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మెహిదీపట్నం గ్యారిసన్‌లోని మిలటరీ అధికారులతో సమావేశమయ్యారు. మెహిదీపట్నం, టోలిచౌకీ, హీకంపేట్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్ వ్యాపారులను మిలటరీ జవాన్‌లు వేధిస్తున్నారని అధికారి సింగ్ దృష్టికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే తీసుకెళ్లారు. చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దని సూచించారు. పలుచోట్ల ఫుట్‌పాత్‌లకు ఆనుకుని ఉన్న మిలటరీ స్థలాలకు పటిష్టమైన ఫెన్సింగ్ ఉండటం వల్ల అటువైపు వెళ్లేందుకు అవకాశమే లేదన్నారు. అయినా కూడా సైనికులు లాఠీలతో చిరు వ్యాపారులను భయాందోళనకు గురిచేస్తున్నారని చెప్పారు. అనంతరం మిలటరీ అధికారి సింగ్ మాట్లాడుతూ.. తమకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను పాటిస్తున్నామన్నారు. కాబట్టే మిలటరీ స్థలాల చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నామని, చిరువ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, మజీద్ తదితరులున్నారు.



భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సుభద్ర నృత్య విహార్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, దేవిస్తుతి, వరవీణ, దశావతార తదితర అంశాలను విదూషి సుబ్రత, యోగిత, తేజ, యశస్విని, ఖుషి, లిపి, ద్యుతి, సాక్షి, విస్మిత ప్రదర్శించారు.



పిల్లోనిగూడ వద్ద ఎంటేరువాగుపై కొనసాగుతున్న వంతెన పనులు

వంతెన పూర్తయ్యేనా ?

- మందకొడిగా రోడ్డు పనులు
- వాహనదారులకు తప్పని అవస్థలు

శంషాబాద్ రూరల్: రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. పిల్లోనిగూడ–మక్తగూడ గ్రామాల మధ్యలో ఎంటేరువాగుపై ఈ వంతెన నిర్మిస్తున్నారు. రెండున్నరేళ్ల కిందట పనులు ప్రారంభించగా.. ఇంకా పూర్తి కావడంలేదు. రోడ్డు విస్తరణ పనులు సైతం మందకొడిగానే సాగుతున్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో రూ. 7 కోట్లతో రోడ్డు విస్తరణ, వంతెన పనులు చేపట్టారు.

తగ్గనున్న దూర భారం..

బెంగళూరు జాతీయ రహదారి నుంచి షాబాద్ రహదారిని అనుసంధానంగా ఈ పనులు కొనసాగుతున్నాయి. పాల్మాకుల నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు 5 కి.మీటర్ల దూరం వరకు రోడ్డును విస్తరిస్తున్నారు. కొత్తూరు మండలంలోని మక్తగూడ, శంషాబాద్ మండలంలోని పిల్లోనిగూడ గ్రామాల మధ్యలో ఉన్న ఎంటేరువాగులో వరద నీటి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలికంగా స్థానికులు ఏర్పాటు చేసుకున్న వంతెనపై నుంచి రాకపోకలు సాగుతుంటాయి. అయితే భారీ వరద వస్తే దారి మూసుకుపోతుంది. ఈ సమయంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే దూర భారం తగ్గుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డు పనుల్లో జాప్యం..

రోడ్డు విస్తరణ పనులు అరకొరగానే నడుస్తున్నాయి. రోడ్డు మార్గంలో కల్వర్టుల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. పిల్లోనిగూడ నుంచి పాల్మాకుల వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోసి చదును చేశారు. పిల్లోనిగూడ నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు కేవలం కల్వర్టుల నిర్మాణమే జరిగింది. రెండున్నరేళ్ల నుంచి పనులు జరుగుతున్నా... నేటికి సగం పనులు కూడా పూర్తి చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఆగిపోయిన వంతెన నిర్మాణ పనులను నెల రోజుల నుంచి మళ్లీ మొదలు పెట్టారు. ఇప్పటికైనా పనులు వేగంగా పనులు అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య శిబిరాలతో ఎంతో మేలు



ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: సేవా సంస్థలు, ఆసుపత్రుల వారు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌లు అన్నారు. మణికొండ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారం, వాయు కాలుష్యం, మంచినీటిని తాగపోవటం లాంటి కారణాలతో అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. తరచూ ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకుని డాక్టర్‌ల సలహామేరకు మందులను తీసుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో మొత్తం 1200 మంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని మందులను తీసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. నోయల్‌ఫార్మా మందులను ఎ. లక్ష్మణ్‌రావు, నరేష్ పవార్‌లు ఉచితంగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లతో పాటు వీఆర్‌ఫర్ సంస్థ ప్రతినిధులు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి. బీరప్ప, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బి. ఇందిర, బీజేవైఎం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: భవానీ కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్‌లో జరుగుతున్న మరమ్మతుల నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

9న ‘మనూ’లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మనూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీ ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డబ్ల్యూఆర్‌ఐ ఇండియా సీనియర్ ఫెలో అమితాబ్ కుందు ‘ఇండియా టువర్డ్స్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ అవకాశాలు, చాలెంజెస్’ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇస్తారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి



మట్టిపైనే వేస్తున్న బీటీ రోడ్డు

రాజేంద్రనగర్: నాణ్యత ప్రమాణాలను పాటించకుండా బీటీ రోడ్లను వేయవద్దని రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ వాసులు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు. రాత్రి సమయంలో బీటీ రోడ్డును వేస్తున్నారని.. దీంతో అది మున్నాళ్ల ముచ్చటగా మారనుందని తెలుపుతున్నారు. ఫిర్యాదు చేసినా.. స్పందించరా.. అంటూ ప్రశ్నిస్తున్నారు. బుద్వేల్ శివాంజనేయ స్వామి దేవాలయం నుంచి కిష్టమ్మ గుట్ట రోడ్డు వరకు కొత్తగా బీటీ రోడ్డును వేసేందుకు జీహెచ్‌ఎంసీ పనులను ప్రారంభించింది. గతంలో ఉన్న రోడ్డును పూర్తిస్థాయిలో తొలగించి కాంక్రీట్ మిశ్రమాన్ని వేసి బీటీ రోడ్డు వేయాలని స్థానికులు అధికారులకు విన్నవించారు. కానీ కాంట్రాక్టర్ కేవలం మట్టిని తొలగించి పాత రోడ్డుపైనే బీటీ రోడ్డు వేసే పనులను ప్రారంభించారు. ఇది నాలుగు రోజుల పాటు కూడా ఉండదని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పనులను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘శ్రీవైష్ణవ’ సంఘం అభివృద్ధికి కృషి

లంగర్‌హౌస్: చాదత్త శ్రీ వైష్ణవ సంఘం అభివృద్ధికి సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్ అన్నారు. సంఘానికి సంబంధించిన 2024 నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన లంగర్‌హౌస్‌లో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ధనుర్మాస ఏకాదశి పూజలతో పాటు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు రవీందర్, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకట యోగి, రఘునాథ్ తదితరులున్నారు.

నేడు ‘పీఎంఎన్‌ఏఎం’ మేళా

బహదూర్‌పురా: పాతబస్తీ తాడ్‌బన్‌లోని ప్రభుత్వ ఓల్డ్ సిటీ ఐటీఐలో నేడు(సోమవారం) ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్(పీఎంఎన్‌ఏఎం) మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. పీఎంఎన్‌ఏఎంకు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, పీఎంకేవీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై.. 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు హాజరవ్వొచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌తో రావాలి. మరిన్ని వివరాలకు 040–24461815 నంబర్‌లో సంప్రదించవచ్చు.

పేకాట ఆడుతున్న నలుగురు అరెస్టు

గన్‌ఫౌండ్రీ: జియాగూడలో నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌పై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ మధుమోహన్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.23,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లన్న గుడి ప్రాంతంలో ఓ ఇంట్లో జూదం ఆడుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. స్థానికుడు ఎం.వెంకటేశ్ గౌడ్(45), నవోదయనగర్‌కు చెందిన బి.బస్వరాజ్, ఎం.గురుస్వామి(37), ఇందిరానగర్‌కు చెందిన వి.జైపాల్(49), సబ్జిమండికి చెందిన షేక్ అన్వర్(50)ని అదుపులోకి తీసుకున్నారు.

ఇంటింటికీ రాముడి అక్షింతలు



అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, బస్తీ ప్రజలు



వివేకానంద కాలనీలో అక్షింతల పంపిణీ

రాజేంద్రనగర్: హైందవుల ఆరాధ్య దైవం శ్రీరాముల అక్షింతలు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలోని చైతన్య వికాస్ కాలనీలో ఇంటింటికి చేరాయి. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మురళీ, మహేశ్, రాజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, హైందవ ప్రతినిధులు ఇంటింటికి పర్యటించి శ్రీరాముల వారి అక్షింతలను చేర్చారు. మహిళా ప్రతినిధులు లత, స్వప్న, కనక దుర్గమ్మ, జ్యోతి, జయ, అరుంధతి, విజయ భారతి, శాంతిలాల్ జోషి, అనీష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దివ్య అక్షింతల పంపిణీ

శంషాబాద్: అయోధ్య శ్రీరామ దివ్య అక్షింతల కార్యక్రమాన్ని పట్టణంలోని వివేకానంద కాలనీలో వైభవంగా నిర్వహించారు. హిందువికాస్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ నామంతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. రామ భజనలతో కాలనీలో ఇంటింటికి తిరిగి అయోధ్య శ్రీరామ దివ్య అక్షింతలను పంపిణీ చేశారు.



నార్సింగి హాల్‌మార్క్ విసినియాలో శ్రీరాముని అక్షింతల పంపిణీ



కోకాపేట హనుమాన్ ఆలయం వద్ద చేపట్టిన అక్షింతల పంపిణీ

సర్కిల్‌లో 1,13,524 దరఖాస్తుల స్వీకరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 5 డివిజన్ల నుంచి ప్రజా పాలన అభయహస్తం సంక్షేమ పథకాల కోసం మొత్తం 1,13,524 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఇందులో అభయహస్తం పథకాల కోసం 81,686 మంది దరఖాస్తు చేశారన్నారు. రేషన్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాల కోసం 31,838 మంది దరఖాస్తు చేశారన్నారు. ఇందులో ఎక్కువ శాతం రేషన్ కార్డుల కోసమే ప్రజలు దరఖాస్తు చేశారన్నారు. ప్రధానంగా సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, అత్తాపూర్ డివిజన్ల నుంచి అత్యధిక దరఖాస్తులు అందాయన్నారు. ప్రస్తుతం ఈ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నామన్నారు.

ఈసీ కాలువ ప్రాంతంలో పొగ ఇక్కట్లు



బుద్వేల్ ఈసీ కాలువ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఎగసిపడుతున్న పొగ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌తో పాటు కిస్మత్‌పూర్ ప్రాంత ప్రజలు శని, ఆదివారం వచ్చిందంటే చాలు భయాందోళనకు గురవుతున్నారు. ఈసీ కాలువ వెంబడి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వైర్లను కాలుస్తుండటంతో దట్టమైన పొగతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఘాటైన వాసన కారణంగా ఇబ్బంది పడుతున్నామని... పోలీస్‌స్టేషన్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా... పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుద్వేల్, గ్రీన్‌సిటీ, ఈసీ కాలువ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా చెట్లతో నిండుకొని ఉంది. ఈ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు విద్యుత్ వైర్లను తీసుకొచ్చి కాలుస్తున్నారు. పొగ కారణంగా స్థానిక చుట్టుపక్క ప్రాంత వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. శ్వాస పీల్చేందుకు సైతం ఇబ్బంది అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులతో పాటు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా... తామేమి చేయాలంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారని వెల్లడిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సామాజిక సేవకులకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న మహేశ్ బాబు, విజయలక్ష్మీ

రాజేంద్రనగర్: నేషనల్ ఉమెన్స్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర భారతీయ రత్న అవార్డు–2024 ఆదివారం అందజేశారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును బిట్కూరి మహేశ్ బాబు, గాలి విజయలక్ష్మీకు అందజేశారు. ఈ కార్యక్రమానికి సంస్థ జాతీయ అధ్యక్షుడు సర్వేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక సేవ కార్యక్రమంలో ప్రతిభ చూపుతున్న వారిని గుర్తించి ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. తమ సంస్థ అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్న వారిని ప్రోత్సహించేందుకు ఈ అవార్డులను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటి రాజ్ కుమార్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్టు గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

ఫస్ట్ ఫ్యాషన్ కేలండర్ -2024



గచ్చిబౌలి: ఫస్ట్ ఫ్యాషన్ కేలండర్ 2024ను పలువురు నటీనటులు ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఐ బొటిక్ , స్టూడియోలుక్స్ ఆధ్వర్యంలో కేలండర్‌ను ఆవిష్కరించి సినీ తారలు సందడి చేశారు. సినీ నటులు నవీన్‌చంద్ర, వెంకట్, చైతన్య రావు ,కృష్ణుడు, కామాక్షి భాస్కర్ల, ప్రణీత పట్నాయక్, అశ్విన్ తదితరులు ఉన్నారు. కొత్త కాన్సెప్ట్‌తో కేలండర్‌ను షూట్ చేశామని ఐ బొటిక్ నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, డాక్టర్ ప్రణతిరెడ్డి పేర్కొన్నారు.

వినికిడి యంత్రం అందజేత



గచ్చిబౌలి: అవయవ లోపంతో బాధపడుతున్న వ్యక్తికి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. మియాపూర్ డివిజన్‌కు చెందిన మనోజ్ చిన్న వయస్సు నుండే వినికిడి లేమితో బాధపడుతున్నారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ బాధితుడికి రూ.50 వేల విలువ చేసే అత్యాధునిక వినికిడి యంత్రాన్ని అందించారు.

వెస్ట్ జోనల్ కమిషనర్‌గా స్నేహ శబరీష్ బాధ్యతల స్వీకరణ



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ (ఐఏఎస్) బాధ్యతలు స్వీకరించారు. వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆదివారం స్నేహ శబరీష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఆయా విభాగాల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె ప్రజా పాలన దర ఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

ఆకట్టుకున్న ‘విద్యాంజలి కిడ్స్ కార్నివాల్’



శేరిలింగంపల్లి: చిన్నారుల వేషధారణలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలోని విద్యాంజలి ఉన్నత పాఠశాలలో ఆదివారం ‘కిడ్స్ కార్నివాల్’ సంబరాలు నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలతో సందడి నెలకొంది. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, పాటలు, పొడుపు కథలు, జానపద నృత్యాలతో అలరించారు. చిన్నారుల ‘భక్త ప్రహ్లాద నాటకం విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఎల్ నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బాలాత్రిపురసుందరి ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.